

# జాతకం జీవితం

శ్రీదేవి

**పంతులుగారు** కళ్ళజోడులోంచి కూతురి జాతకాన్ని పరిశీలిస్తున్నారు. ఆయన భార్య మంచితీర్థం తీసుకొచ్చి చాలా సేపటి నుంచి నిలుచుని ఉంది. "ఎంతసేపు ఇలా నిలుచోమంటారు? తర్వాత చూడచ్చు లెండి. తీసుకోండి" అన్న దామె విసుగ్గా.

తల పైకెత్తి చూసి పెదివి విరిచా డాయన. "ప్చ్! ఈ ఏడాదికూడా కల్యాణయోగం ఉన్నట్లు లేదే!" అన్నాడు నిర్లిప్తంగా.

చ్రురుమని లేచిందావిడ. "ఎలా ఉంటుందీ? ఈ ఏడాదే కాదు, ఎన్నేళ్ళు గడిచినా దాని కా కల్యాణ యోగం రాదు. ఏ నాడైనా అలా వెళ్ళి ఒక్క సంబంధమైనా విచారించారు గనుకనా!"

"అయితే ఏమిటే నువ్వనేదీ? అయ్యా, బాబూ, నా పిల్లను చేసుకోండి అంటూ బిచ్చగాడిలా ప్రతి గుమ్మంలోనూ నుంచుని అరవమంటావా?" అన్నా డాయన విసుగ్గా. ఆయనది క్షణికోద్రేకం. అంతలోనే భార్య అవివేకానికి జాలేసింది ఆయనకు. "ఓసి పిచ్చిదానా! అసలు దాని కా ఘడియ ఇంకా రానిదే ఎన్ని ప్రయత్నాలు చేసినా దండగే. సామెత వినలేదూ. కక్కొచ్చినా కల్యాణ మొచ్చినా ఆగదని! వూరికే అన్నారా పెద్దలు!"

"అదే కాదు, మృత్యువుకూడా ఆగదండి. అసలు దాని పెళ్ళి చూసే రాత నా ముఖాన రాసి ఉంటేగా?" అంటూ విసురుగా లోపలి కెళ్ళి పోయిం దావిడ.

"శాస్త్రాన్నే ప్రశ్నిస్తుందేమి టీవిడ! నే నెంత ప్రయత్నించినా దానికాఘడియ రానిదే కుదురుతుందా అంతా దీని పిచ్చి కాని..." అని గొణుక్కున్నారు పంతులుగారు.

గాయత్రి పంతులుగారి ఒక్కగానొక్క కూతురు. చక్కనిది. ఎమ్. ఎ. చదువుతూంది. సవిమంతురాలు. ఇరవై ఏళ్ళు నిండాయి ఆమెకు. ఆమె పెళ్ళికని పంతులుగారు దూరదృష్టితో కొంత వెనకేశారు కూడా. పైగా ఆయన అంత లేని వారు కారు.

గాయత్రి బి. ఎ. పూర్తవక ముందే ఆమె చక్కదనం, చురుకు చూసి ముచ్చటపడి రెండు మూడు మంచి సంబంధాలు వచ్చాయి. వాళ్ళజాతకాలు 'అంత దివ్యంగా లేనందువల్ల' పంతులుగారు తిరస్కరించారు. అది కాక అనసూయమ్మగారి అన్నకు తన కొడుక్కి గాయత్రిని చేసుకోవాలని సంకల్పం కలిగింది. "పిల్లవాడు రత్నంలా ఉంటాడు. మంచి ఉద్యోగం" అనుకున్న అనసూయమ్మగారు అన్నని ప్రోత్సహించింది. అయితే పంతులుగారు మాత్రం పిల్లవాడి జాతకాన్ని పరిశీలించి చప్పరించేశారు. "అబ్బే. మన గాయత్రికి ఇంతకంటే అమోఘమైన సంబంధమే వస్తుంది" అన్నారు.

అనసూయమ్మగారు కుంగిపోయారు. "ఇంకో సంబంధమా? సరిసరి. ఇలాగే జాప్యం చేస్తూ కూర్చుంటే మా అన్నయ్య వాడికి ఇంకో సంబంధం కుదుర్చుకుంటాడు" అని భర్తకు హెచ్చరించింది. సంవత్సరం గడిచినా సంబంధం ముడిపడలేదు.

ఉన్నట్టుండి అనసూయమ్మగారి అన్న వూడి పడ్డాడు. వాళ్ళబ్బాయికి కలకత్తా బదిలీ అయిందట. పెళ్ళి చేసుకుని మరీ వెళతానన్నాడట. పంతులుగారు ఏ విషయమూ తేల్చి చెప్పనందువల్ల వేరే సంబంధం కుదుర్చుకుని తాంబూలాలు పుచ్చుకున్నారట. "చెప్పి పోదామని వచ్చా, బావా" అన్నాడు లేస్తూ.

"శుభం" అనేసి పంతులుగారు నిమ్మకు నీరెత్తి నట్లు కూర్చున్నారు. అనసూయమ్మగారికి ఘొల్లు మందా మనిపించింది. గుడ్ల నీరు కుక్కుకుని లోపలి కెళ్ళిపోయిం దామె.

గాయత్రికి ఈ విషయం తెలిసి తేలిగ్గా నిట్టూర్చింది. ఆమెకు బావ మీద మొదటినుంచి మనసు లేదు. ఆమె మనసుకు నచ్చిన వ్యక్తి కాలేజీ లైబ్రేరియన్ శంకర్. ఆ రోజే శంకర్ గాయత్రిని తమ పెళ్ళి సంగతి ఇంట్లో ప్రస్తావించమని హెచ్చరించాడు. ఎలా ప్రస్తావించాలి అన్న విషయం చర్చించుకుంటూ ఇద్దరూ బస్‌స్టాప్‌లో నిలబడ్డారు. చిరుచీకటి పడుతూంది. సన్నగా వర్షం మొదలైంది. శంకర్ ఎక్కవలసిన బస్ వచ్చింది. అతను వెళ్ళిపోయాడు. జల్లు పెద్దదవుతుంటే అక్కడున్న కొద్దిమందీ తలో ఒక దిక్కు వెళ్ళిపోతున్నారు. కనీసం ఒక రిక్షా అయినా దొరికేట్లు లేదు. తను తడుస్తున్నది. బస్‌స్టాండ్ దగ్గరున్న హోటల్‌లో కూర్చున్న కుర్రవాళ్ళు ఒంటరిగా నిలబడ్డ గాయత్రిని చూసి ఈలలు వేసి, కామెంట్లు విసురుతున్నారు. తను అటు చూస్తే వెకిలి వేషాలేస్తున్నారు. గాయత్రికి భయం వేసింది. ఇంతలో ఒక స్కూటర్ అటుగా వస్తూ తనకు దగ్గరగా ఆగింది. పరకాయించి చూస్తే ఆ స్కూటరు మీద వచ్చినాయన ఎకనామిక్స్ లెక్చరర్ వామనరావుగారు. గాయత్రికి కొండంత ఉత్సాహం వచ్చింది. మొగమాట పడకుండా "సార్, సార్ ఏదైనా ఆటోనో, రిక్షానో దొరికేచోట

## ఇంతకన్న రుజువేం కావాలి?

ఒకడు తాను ప్రవక్తనని చాటటం ప్రారంభించాడు. "ఏదీ కాస్త రుజువు చూపించ" మని అడిగారు అక్కడి ప్రజలు.

"మీరేదైనా మనసులో ఆలోచించుకోండి. ఆ ఆలోచన ఏమిటో నేనిట్టే చెప్పేస్తాను. ఇంత కన్నా రుజువేం కావాలి?" అన్నాడు.

"ఆ— మేమందరం ఆలోచించుకున్నాం. ఇక మా ఆలోచనలేమిటో చెప్పు చూదాం" అని నిలదీశారు.

"మీరంతా కూడా నేనొక బుద్ధిహీనుణ్ణనీ, అబద్ధాలు చెప్పే రకమనీ నన్ను గురించి అనుకున్నారు అవునా?" అని అడిగాడు.

"నిజమే సుమా. మన ఆలోచనని ఇట్టే పసిగట్టేశాడు." అనుకున్నారు అక్కడి ప్రజలు.

- ప్రవీల్

---

డ్రాప్ చెయ్యండి. ప్లీజ్" అని అడిగింది. ఆయన పరిస్థితి అర్థం చేసుకునే స్కూటర్ ఆపాడు. అందుకే ఆమె అడగగానే ఎక్కమన్నాడు. కొద్ది దూరం వెళ్ళాక ఒక రిక్షా కనిపించింది. స్కూటర్ దిగి గాయత్రి కృతజ్ఞతలు తెలిపింది.

"గాయత్రీ! నీ కొక ముఖ్య విషయం చెప్పాల్సి ఉంది. మన లైబ్రేరియన్ శంకర్‌ను అతిమా విన్తున్నావా?" అన్నాడు వామనరావు స్కూటరు మీద కూర్చునే.

గాయత్రికి ఏం చెప్పాలో తోచలేదు. హఠాత్తుగా ఎదురైన ప్రశ్న విని మౌనంగా తల వంచుకుంది.

"అతని గురించి నీకు పూర్తిగా తెలుసా? వూరికే సినిమాలూ, షికార్లేనా ... లేక నిన్ను సీరియస్‌గా తీసుకుంటున్నాడా?' ఆయన కంఠంలో కాస్తంత ద్వేషం కనిపించింది.

గాయత్రికి బాధ, కోపం ఒక్కసారే వచ్చాయి. ఇదేమిటి? ఇలా దారిలో అడగడ మేమిటి? తనను ఆయన అవమానిస్తున్నట్లు ఫీలయి, "సార్ ... అది మా వ్యక్తిగత విషయం" అన్నది వణుకుతున్న కంఠంతో.

"అందుకే గదా నిన్ను అడిగింది! చూడు, గాయత్రీ! నువ్వు చదువుకుంటున్నావు. తెలివిగల దానివి. నీకు తగిన వాడు దొరకకపోడు. శంకర్‌ని మర్చిపో. వాడివైపు కన్నెత్తి కూడా చూడకు. నా మాట విను." ఆయన కంఠం జీరపోయింది. ఆయన మీద ఉన్న గౌరవం, అభిమానం గాయత్రిని పెదవి కదపనివ్వలేదు. ఆమె ఆశ్చర్యం నుంచి తేరుకోవడం కష్టంగా ఉంది.

"గాయత్రీ! నీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి ఒక్కసారి రా. ప్లీజ్. చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకోకు." ఆయన కంఠంలో వినిపించిన అభ్యర్థన ఆమెలో కుతూహలాన్ని రేపింది. ఏ నాడూ అవసరానికి మించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా గంభీరంగా ఉండే వామనరావుగారేనా ఇలా మాట్లాడుతున్నది అనిపించిం దామెకు. తన నెందుకు రమ్మంటున్నాడు? వెళ్ళటం ఉచితమేనా? సంశయిస్తున్న గాయత్రిని మళ్ళీ అడిగా డాయన. మరి మాట్లాడకుండా స్కూటర్ ఎక్కి కూర్చుంది. ఎవరి ఆలోచనల్లో వారు ఉండగానే స్కూటర్ వామనరావుగారి ఇంటి ముందు ఆగింది. "రామ్మా!" అంటూ లోపలికి నడిచా డాయన.

తలుపు తీసిన భార్యకు గాయత్రిని పరిచయం చేశాడు. వామనరావుగారి కూతురు కాబోలు ఒక అమ్మాయి గాయత్రితో మాటలు కలుపుకుని తడిసిన తల తుడుచుకోవడానికి టవలు ఇచ్చింది.

పొడి బట్టలు కట్టుకొని వామనరావు అక్కడికి వచ్చాడు. ఆయన భార్య ఇద్దరికీ వేడి వేడి కాఫీ పట్టుకొచ్చింది. భార్యనీ, కూతుర్నీ అవతలికి పంపి వామనరావు ఒక ఫోటో ఆల్బం గాయత్రి చేతి కిచ్చాడు.

గాయత్రికి ఆయన అది ఎందుకిచ్చాడో అర్థం కాలేదు. అది తెరచి చూడాలనిపించలేదు.

"సార్, మీరు చెప్పాలనుకున్న దేమి టసలు? మీకూ, శంకర్‌కీ సంబంధం ఏమిటి?" అన్నది నెమ్మదిగా తల వంచుకొని.

"అన్ని జవాబులూ ఆ ఆల్బం చూస్తే తెలుస్తాయి. కానీ ఒక్క విషయం, గాయత్రీ! నే నేదో మీ ఇద్దరినీ దూరం చేసి సంతోషిద్దా మనుకుంటున్నానని మాత్రం అనుకోకు" అన్నా డాయన.

"ఛ, ఛ. అదేం లేదు, సార్." నొచ్చుకుంటూ ఆల్బం తెరిచింది. ఒక శుభలేఖ మొదటి పేజీలో ఉంది. వరుడి పేరు శివశంకర్. వధువు సుకన్య. గాయత్రి కళ్ళలో గిర్రున నీళ్లు తిరిగాయి. పొంగి వస్తున్న దుఃఖాన్ని పళ్ళ బిగువున అదిమిపట్టి పేజీ తిప్పింది. ఒక అమాయకమైన పదహారు పదిహేళ్ళఅమ్మాయి పెళ్ళికూతురి ముస్తాబులో నవ్వుతూ ఉంది.

తరువాతి పేజీలో ఉన్న ఫోటోలో శంకర్‌ని గుర్తించి గాయత్రి ముఖం పాలిపోయింది.

ఆల్బంలో మరి కొన్ని పెళ్ళిఫోటో లున్నాయి. అందులో వామనరావు, ఆయన భార్య పెళ్ళిపీటల మీదున్నారు. ఆఖరి పేజీలో పెళ్ళి కూతురి ఫోటో ఒక్కటే ఉన్నది. దానికింద ఒకతెల్లకాగితం అంటించి ఉంది. అందులో ఇలా రాసి ఉంది:

"భర్త స్వార్థానికీ, ధన దాహానికీ దారుణంగా బలైపోయిన మరో చెల్లెలికి ఏమీ చెయ్యలేని ఎందరో అన్నల్లాగే ఈ అన్న వదిలే అశ్రుతర్పణం."

గాయత్రి తుఫానులోచిగురాకులా వణికిపోయింది. కంగారుగా మొదటి పేజీ తిప్పింది మళ్ళీ.

శుభలేఖలో వామనరావు దంపతుల పేరుంది. అంటే వామనరావు చెల్లెలిని శంకర్‌కు ఇచ్చి పెళ్ళి !! గాయత్రి మెదడులో వెయ్యిపిడుగులు పడ్డట్టయింది. ఆమె అచేతనంగా కింద పడిపోయింది.

ఆమె తేరుకునే టప్పటికి వామనరావు కుటుంబం తన చుట్టూ ఉన్నది. వామనరావుగారి భార్య గాయత్రిని తల నిమిరి దగ్గరకు చేర్చుకుంది. గాయత్రి వెక్కివెక్కి ఏడ్చింది. 'అదృష్టవంతురాలివమ్మా. ఆ పిశాచికి బలి కాకుండా బయటపడ్డావు' అన్నది ఓదార్పుగా.

వామనరావు ఆమెకు జరిగినదంతా వివరంగా చెప్పాడు. దానిసారాంశం—శంకర్ 20 వేలు కట్నం తీసుకుని సుకన్యను చేసుకున్నాడు. కానీ అతని ఆశ తీరక భార్యను రాచి రంపాన పెట్టేవాడు. ఆమె ఒంటిమీద నగలన్నీ అమ్మి రేసులకీ పేకాటకీ తగలేసేవాడు. ఆమె గర్భవతి అయిందని తెలిసి బలవంతంగా అబార్షన్ చేయించాడు. ఏ గొడవకు పర్యవసానమో గానీ, సుకన్య మంటలకు ఆహుతి అయింది. శంకర్ మాత్రం దర్జాగా చేతులు దులుపుకుని బయట పడ్డాడు. సుకన్య బ్రతికున్న రోజుల్లో అన్నకు రాసిన ఉత్తరాలు కొన్ని వామనరావు దగ్గ రున్నాయి. అవి తెచ్చి గాయత్రికి చూపాడు.

అందులో తనకు కొంత డబ్బు అత్యవసరంగా కావాలనీ, తనను ప్రాణాలతో చూడాలనుకుంటే ఆ ఏర్పాటు వెంటనే చెయ్యమనీ ఉంది. కానీ సంతకం లేదు. సంబోధన లేదు. "పేరు బయట పడకుండా సుకన్య ఆ మనిషి కోసం అంత జాగ్రత్త పడేది. ఆ జాగ్రత్తే దాని కొంప ముంచింది" అన్నాడు బాధగా వామనరావు.

నిట్టూర్చి లేచింది గాయత్రి. "సార్, మీ జ్ఞాపకాలను రేపి మిమ్మల్ని బాధ పెట్టినందుకు క్షమించండి. నా కళ్ళు తెరిపించినందుకు మీకు జీవితాంతం రుణపడి ఉంటాను" అన్నది సీరియస్‌గా.

ఆమె వికలమైన మనసుతో ఇంటికి వచ్చింది. ఆ రాత్రి విపరీతమైన జ్వరం వచ్చిం దామెకు. అది తగ్గేటప్పటికి వారం పట్టింది. శంకర్‌ను మరచిపోయే ప్రయత్నం చేస్తూం దామె. ఇంతలో ఒక ఉత్తరం వచ్చింది. అది చాలా క్లుప్తంగా ఉంది.

"ప్రియమైన గాయత్రీ,

కొందరి ద్వారా నువ్వు వామనరావు స్కూటర్ ఎక్కినట్లు తెలిసింది. అతనంటే నాకు అంత మంచి అభిప్రాయం లేదు. ఇంకోసారి అతనితో మాట్లాడినా, అతని స్కూటర్ ఎక్కినా బాధ పడతాను. నువ్వు కనిపించి చాలా రోజులైంది. చూడకుండా ఉండలేకపోతున్నాను.

—శంకర్."

కొన్నాళ్ళకు శంకర్‌కు ఒక ఉత్తరం వచ్చింది.

"శంకర్,

నీతో స్నేహం కేవలం ఒక పొరపాటు. నేనే కాదు, ఏ ఆడదీ మరో సుకన్య కావాలని కోరుకోదు."

ఆ ఉత్తరం చేరాక శంకర్ సెలవు పెట్టి ఎటో వెళ్ళిపోయాడు.

'గిల్టీ ఫీల్' అనుకుంది గాయత్రి. అతన్ని చాలా సులభంగా మరిచిపోగల్గింది.

● ● ● ●

ఎలాగైతేనేం చాలా కాలం తర్వాత పంతులు గారికి ఒక పిల్లవాడి జాతకం గాయత్రి జాతకంతో బ్రహ్మాండంగా జత పడిన ట్లనిపించింది. అయితే పిల్లవాడి తల్లితండ్రులు కట్నం ముప్పై వేలడిగారు. జాతకం తప్ప పిల్లవాడికి చెప్పుకోదగ్గ అర్హతలేం లేవు. గాయత్రికి అప్పటికి ఇరవై అయిదు ఏళ్ళు

పోదాలు.

"ఏం చూసుకుని అంత కట్నం అడిగారు?" అని తండ్రిని నిలదీసిం దామె.

"ఆ పిల్లాడికేం తక్కువే! రాజులాంటి కుర్రాడు. అద్భుతమైన జాతకం!" అంటూ గ్రహ సంచారాలూ, మునుముందు అతగాడు సాధించబోయే ఘన కార్యాలూ, అతని జాతకరీత్యా తాను తెలుసుకున్న దంతా ఏకరువు పెట్టారు పంతులుగారు. ఆయన ముగించేసరికి భార్య చాప మీద కునికిపాట్లు పడుతూంది. కూతురు ఎప్పుడో లేచి లోపలికి వెళ్ళిపోయింది.

మర్నాడు అనసూయమ్మ కూతురికి శత విధాల నచ్చజెప్పాలని ప్రయత్నించింది. కాళీకల్లా విరుచుకు పడింది గాయత్రి.

"ఇన్నాళ్ళు ఎన్నో మంచి సంబంధాలొచ్చాయి. అయినా జాతకాల పేచీ తీసుకొచ్చి కాదుపొమ్మన్నారు మీరు! ఇప్పుడేమో పట్టి జాతకం పట్టుకొని దిక్కుమాలిన సంబంధం కుదురుస్తానంటే సరే నంటానికి మనిషిననుకున్నారా, గొడ్డననుకున్నారా?"

ఇక లాభం లేదనుకుని పూరుకున్నా రిద్దరూ. పంతులుగారు అలిగి కూతురి వైపు కన్నెత్తి చూడటం మానేశారు.

"ఇహ ఈ జన్మకు దీని పెళ్ళి కాదే!" అనేవా డాయన.

"మరే! ఆ ముక్క కూడా నా జాతకం సెలవిస్తోందా?" అనేది వ్యంగ్యంగా గాయత్రి. అలా ఇంకో రెండేళ్ళు దొర్లిపోయాయి. లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోంది గాయత్రి.

అలా కాలం గడుస్తున్నకొద్దీ గాయత్రిలో అపోరకమైన నిర్లిప్తత, విముఖత్వం చోటు చేసుకొన్నాయి. పైగా వ్యక్తిత్వం కల మనిషి కావటంతో కొంత తెగింపు కూడా అలవడింది. తల్లి సాధింపు, తండ్రి చాదస్తం ఆమెలో విరక్తిని కలిగించాయి.

కాలేజీ నుంచి ఇంటికి రావటమే ఒక పెద్ద గండంలా అనిపించేది. తన తోటి స్త్రీలు ఆనందంగా పిల్లా పాపలతో సంసారాలు చేసుకొంటూంటే "నాకెందుకీ ఒంటరి బ్రతుకు?" అని బాధ పడేది. ఏ క్షణాన్నైనా పగలబోయే అగ్ని పర్వతంలాంటి మనసుని చిరు నవ్వు చాటున దాచుకొనేది అతి కష్టం మీద ఆమె.

ఒకరోజు అకస్మాత్తుగా అనసూయమ్మ అన్నగారు వచ్చారు. ఆయన కోడలు పురిటిలో ఆ మధ్యే చనిపోయింది. కుశల ప్రశ్న లయ్యాక గాయత్రి వివాహ ప్రసక్తి తీసుకు వచ్చి "బావా! గాయత్రిని ఇదివరకు మనమంతా అనుకున్నట్లుగా మా వాడికి... అడగడానికి నోరు రావట్లేదు కానీ..." అంటూ నసిగాడు.

అనసూయమ్మ ముఖం చాటంతైంది. "నీ కోడలు పోయిందని తెలిసి నేనే అడుగుదామను కున్నాను అన్నయ్యా! గాయత్రి నీ ఇంట్లో సుఖపడుతుంది. నాకు నిశ్చింత!" అన్న దామె.

"ఎలాగతేనేం! ఆలస్యమైనా నా మేనకోడలే నా కోడలౌతుందని రాసిపెట్టి ఉంది కాబోలు. ఏం బావా? ఇప్పటికైనా సరే అంటావయ్యా!"




అన్నా డాయన. ఆయనకు తెలుసు, పంతులుగారి పరిస్థితి. మంచి సంబంధాలు వస్తాయనే ఆశ, తీసుకొచ్చే ఓపిక ఆయనలో నశించాయనే ధైర్యంతో, కాదనడనే నమ్మకంతో ఈ ప్రస్తావన తీసుకొచ్చాడు.

"మీ వాడికి కళత్ర వియోగం ఉంది, బావా. అందుకే ఇంతకు ముందు నా చేత కాదనిపించాడు భగవంతుడు. ఇహ మీవాడి జాతకానికి తిరుగులేదు. సరే, కానివ్వండి" అన్నారు పంతులుగారు బింకం సడలకుండా. "దాన్ని కూడా ఒక మాట అడగండి మరి" అంటూ లేచాడు ఆయన బావమరిది. గాయత్రి అంతా వింటూన్నదని ఆయనకు తెలుసు.

"చూశావా. శాస్త్రం తప్పు పలకదే. కొంత ఆలస్యం జరిగినా కోరుకున్న సంబంధమే గడపలో కొచ్చింది" అన్నారు ధీమాగా పంతులుగారు వంటింటి దగ్గర భార్యతో. తృప్తిగా నవ్వింది అనసూయమ్మ.

"నిజమే సుమండీ! ఏమిటో అనుకున్నాను. మీ రన్నట్లే జరిగింది. దానికీ ఇష్టమేనండీ ఈ సంబంధం. అన్నయ్యతో గొడవ పెట్టుకుంటుం దను కున్నాను. అంతా విన్నది కదా. అయినా ఒక్క మాటైనా అన్లేదు. మంచిరోజుచూసి తాంబూలాలు పుచ్చుకుందాం" అన్న దామె ఆనందంగా.

చాలా రోజుల తరవాత తృప్తిగా భోజనం చేశా రందరూ. గాయత్రి మవునంగా తన పనులు తాను చేసుకొంది.

మర్నాడు ఎవరో తట్టి లేపుతూంటే ఉలికి పడి లేచారు పంతులుగారు. గోలుగోలున ఏడుస్తూ భార్యకనిపించింది. వణుకుతున్న చేతులతో ఓ ఉత్తరం అందించిందామె. ఆయన మనసేదో కీడు శంకించింది. కళ్ళ జోడు తగిలించుకొని చదవసాగా డాయన.

"నాన్నా!

మీ నమ్మకాలకు నా జీవితంలోని అమూల్యమైన కొన్ని సంవత్సరాలను పరీక్షకు పెట్టారు. 'ఎందుకు' అని అడిగినా లాభం ఉండదనీ, ఆ రోజులు తిరిగి తీసుకు రాలేరనీ తెలిసి అడగటం లేదు.

జాతకం! ఈ కాగితంతో నా జీవితాన్ని ముడి పెట్టి ఇన్నాళ్ళూ నాకు పెళ్ళి కాకుండా చేశారు.

ఏ విషయంలో అయినా పట్టూ, విడుపూ ఉండాలి. జరగనున్నది జాతకంద్వారా కొంత తెలుసుకో గలమేమో గానీ, కేవలం జాతకాన్ని ఆధారం చేసుకొని భవిష్యత్తును నిర్మించుకోలేము. ఎంతటి పండితులకైనా అది అసాధ్యం. మొండిగా, చాదస్తంగా ఎన్నో మంచి సంబంధాలు తిరస్కరించారు. నాకు ఏ పాటి సంబంధం తేగలిగారు? ఆఖరుకు రెండో పెళ్ళివాడినా? నాకేం తక్కువని! బావకున్న ఆ 'కళత్ర వియోగం' పాపం ఆ అభాగ్యురాలి మీదుగా కొట్టుకు పోయిందన్నారు. ఇన్నేళ్ళు నాకు పెళ్ళి కాని పాపానికి నన్ను అతని కిచ్చి కడతారా? ఇదేనా మీరు నాకు చూస్తామనుకున్న 'అమోఘమైన సంబంధం'? జాతకాలు తప్పో, ఒప్పో నిరూపించటం లేదు నేను. అంత పాండిత్యం నాకు లేదు. అది నాకు అనవసరం. కానీ మీ మంకుపట్టు ఎటువంటి విషమ పరిస్థితులకు దారి తీశాయో తెలుసుకోండి. ఇక వెదకలేక, ఏమీ కుదరక, కాలంతో ఈ విధంగా రాజీ పడి, నా పెళ్ళి ఇలా జరిపించి, నన్ను వదిలించు కుందామనుకుంటున్నారా, నాన్నా? తెల్లవారితే మీతో ఘర్షణ తప్పదు. మీతో వాదించీ, నాలో నేను తర్కించుకునీ విసిగి పోయాను. నేను ఈ పెళ్ళి చేసుకోను అంటే మన మధ్య సన్న దారంలా ఉన్న ఆ కాస్త సంబంధం కాస్తా తెగక మానదు. మనశ్శాంతిలేని జీవితం ఇంకెంతకాలం నాకు, మీకు?

నేను ఇల్లు విడిచి వెళ్తున్నాను. నా బ్రతుకు నేను బ్రతకగలను. నన్ను అనవసరంగా వెదికే ప్రయత్నం చెయ్యకండి. లోకంలో నలభై ఏళ్ళొచ్చినా పెళ్ళిళ్ళు కాని దురదృష్టవంతురాళ్ళున్నారు. వాళ్ళతో పోల్చుకుంటే నాకింకా వయసు మించి పోలేదు. వయసుకు మించిన విరక్తి మాత్రం కలుగుతుంది మీ పుణ్యమా అని! ఏదేమైనా మామయ్యను ఆశ వదులుకొమ్మని చెప్పండి.

ఏ మలుపులోనో నాకు నచ్చిన వ్యక్తి తారసపడి, మీ రన్నట్లుగా పెళ్ళనేది నా నుదుట రాసి ఉంటే, చేసుకుంటాను! అప్పుడు మీ దగ్గరికి వస్తాను. ఎవరేమనుకున్నా నాకు లెక్క లేదు. జీవితంలోని ప్రతి మలుపునూ జాతకం సూచించదు, నాన్నా! అందుకే 'విధి', 'కర్మ' అనే వాటిని ఈశ్వరుడి లీలలుగా నమ్ముతాం. అవి కేవలం జరుగుతూ అనుభవంలో కొస్తాయి. ఉంటాను మరి...

—మీ గాయత్రి."

పిచ్చెక్కినట్లు అరుస్తోంది అనసూయమ్మ. "ఇదంతా మీవల్లే జరిగింది! మీ జాతకాల పిచ్చే దాన్ని ఇంట్లోంచి తరిమేసింది. మీరే దీని కంతటికీ కారణం!"

పంతులుగారికి ఆమెను ఓదార్చే శక్తి లేదు. అసలు ఆయనకీ ఓదార్పు అవసరమైనట్లు నిస్త్రాణగా మంచం మీదికి వాలారు. అనసూయమ్మ 'మీరే దీనికి కారణం' అని నిందిస్తుంటే 'నిజమే' అని ఆయన అనలేదు.

ఆయన దృష్టి దిండు పక్కనే మడిచిపెట్టి ఉన్న కూతురి జాతకం మీద ఉంది. పెళ్ళికాని కూతురు ఇల్లు విడిచి వెళ్ళిపోతుందనే సూచన జాతకంలో తనకెందుకు కనిపించలేదో అర్థం కాలే దాయనకు. ★